క్లుప్తంగా

డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల గడువు పెంపు

రామచంద్రపురం: ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ల గడువు జూలై 5వ తేదీ వరకూ పొడిగించినట్టు కళాశాల ప్రిన్సిపాల్ కేసీ సత్యలత సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 2023–24 విద్యా సంవత్సరం నుంచి డిగ్రీలో సింగిల్ మేజర్ సబ్జెక్టు విధానం మొదలవుతుందని, నూతన విద్యా విధానంలో వైవిధ్యమైన కాంబినేషన్‌లతో కొత్త కోర్సులు ప్రవేశపెట్టామన్నారు. ఇంజినీరింగ్, మెడిసన్ కోర్సుల కంటే ఆదరణ అధికంగా ఉంటుందన్నారు. డిగ్రీతో పాటుగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించే గ్రూప్స్, సివిల్ సర్వీసెస్ ఇతర పోటీ పరీక్షలకు సమగ్ర శిక్షణ, సర్టిఫికెట్ కోర్సులు చేసే అవకాశం కల్పిస్తామని వివరించారు. ఇక్కడ బీఏ గ్రూప్స్, ఫిజిక్స్, మ్యాథ్స్, కామర్స్, కెమిస్ట్రీ, బోటనీ, ఆక్వా కల్చర్, జువాలజీ, కంప్యూటర్ సైన్స్ గ్రూపులు ఉన్నాయన్నారు. జూన్ 19 నుంచి జూలై 5 వరకూ ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్ కోసం కళాశాలలో ఉచిత సౌకర్యం కల్పించామన్నారు. జూలై 7 నుంచి 12 వరకూ ఎంపికలు, జూలై 16న సీట్ల కేటాయింపు జరుగుతుందని 17 నుంచి కళాశాలలో తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. పూర్తి వివరాలకు 8885349991, 7893379425లకు ఫోన్ చేసి వివరాలు తెలుసుకోవచ్చునని తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలికి గాయాలు

కాజులూరు: కాకినాడ, కోటిపల్లి రహదారిలో కాజులూరు మండలం గొల్లపాలెం వద్ద సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వృద్ధురాలు గాయాలపాలైంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కరప మండలం గొర్రిపూడికి చెందిన పుణ్యమంతుల సుబ్బయ్యమ్మ గొల్లపాలెం బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళుతుంది. బస్సు ఎక్కేందుకు మెయిన్ రోడ్డులో బస్సు సెల్టర్ వద్దకు నడచి వెళుతుండగా ఎదురుగా వచ్చిన మోటార్‌సైకిల్ ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో ఆమె తలకు బలమైన గాయమయ్యింది. స్థానికులు గమనించి గ్రామంలోని ఒక ప్రవేటు ఆసుపత్రిలో చేర్పించారు.

కురకాళ్లపల్లిలో బీజేపీ ప్రచారం

రాయవరం: ప్రధాని నరేంద్రమోదీ తొమ్మిదేళ్ల సుపరిపాలన కార్యక్రమాన్ని బీజేపీ నేతలు సోమవారం కురకాళ్లపల్లిలో నిర్వహించారు. ఆ పార్టీ మండల శాఖ అధ్యక్షుడు శాకా దుర్గా శ్రీనివాస్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ మండపేట నియోజకవర్గ కన్వీనర్ చాట్రాతి జానకి రాంబాబు, కో–కన్వీనర్ కేవీవీ సాయిరామ్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నరాల రాంబాబు తదితరులు బీజేపీ గృహ సంపర్క్ అభియాన్ నిర్వహించారు. ప్రధానమంత్రిగా నరేంద్రమోదీ సాధించిన విజయాలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి వల్లభనేని రవీంద్రబాబు, ఉపాధ్యక్షుడు కోన సత్యనారాయణ, జిల్లా కార్యదర్శి గొడవర్తి రామచంద్రరావు, జిల్లా కార్యవర్గ సభ్యులు చిరట్ల సుబ్బారావు, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

శ్రీనివాసరావును పరామర్శించిన వెంకన్నబాబు

రాయవరం: పితృ వియోగంతో బాధపడుతున్న మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావును వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్నబాబు సోమవారం పరామర్శించారు. శ్రీనివాసరావు తండ్రి చంద్రరావు ఈ నెల 18న మృతి చెందిన విషయం విదితమే. శ్రీనివాసరావును వెంకన్నబాబు పరామర్శించి, సానుభూతి వ్యక్తం చేసి, చంద్రరావు చిత్రపటం వద్ద నివాళులర్పించారు. తహసీల్దారు కేజే ప్రకాష్‌బాబు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, వైఎస్సార్ సీపీ నేతలు అల్లంపల్లి కిషోర్, అద్దంకి రమణ పరామర్శించారు.

వైద్య ఖర్చులకు సాయం



సత్యనారాయణకు నగదు అందజేస్తున్న కలెక్టర్

అంబాజీపేట: హెర్నియా వ్యాధితో బాధపడుతున్న ఏడాది బాబు నేర్లగంటి షణ్ముఖ్ వెంకట్‌కు వైద్య ఖర్చుల నిమిత్తం వలంటీర్లు ఆర్థిక సాయాన్ని అందించారు. జిల్లా వలంటీర్ జేఏసీ తరఫున సమకూర్చిన రూ.15 వేలను సోమవారం డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా చేతులమీదుగా ఆ బాబు తండ్రి సత్యనారాయణకు అందజేశారు. జిల్లా వలంటీర్ జేఏసీ నాయకులు స్వామి, సూర్య, నాగలక్ష్మి, సాయి, చిట్టిబాబు పాల్గొన్నారు.

అర్హులైన తల్లులందరికీ 'జగనన్న అమ్మఒడి'

ఆలమూరు: స్థానిక ఖండ్రిగ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సోమవరం పేరెంట్స్ కమిటీ సమావేశం జరిగింది. మండల విద్యాశాఖ ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు అద్దరి శ్రీనివాసరావు అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా సమగ్ర శిక్ష అకాడమిక్ మానిటరింగ్ అధికారి పిల్లి రాంబాబు పాల్గొని విద్యార్థుల అభ్యున్నతి కోసం ప్రభుత్వం అందిస్తున్న పథకాలను సమగ్రంగా వివరించారు. బడి బయట పిల్లలను బడిలో చేర్పించాలని, తద్వారా విద్యార్థుల భవిష్యత్తుకు బంగారు బాట వేయాలని తల్లిదండ్రులకు ఆయన విజ్ఞప్తి చేశారు. పేరెంట్స్ కమిటీ చైర్మన్ శ్రీమతి దుర్గ సీఆర్పీ ఏ జ్యోతి, యడ్ల అపర్ణ పాల్గొన్నారు.

సర్వేకు శ్రీకారం .. లెప్రసీకి చరమగీతం

- వ్యాధి నిర్మూలనే లక్ష్యంగా ప్రభుత్వం కృషి
- వ్యాధిగ్రస్తుల గుర్తింపునకు కొనసాగుతున్న సర్వే
- అందుబాటులో బహుళ ఔషధ చికిత్స
- రామచంద్రపురం ఆసుపత్రి పరిధిలో 8 కేసుల గుర్తింపు



రామచంద్రపురం పట్టణంలో సర్వేను పర్యవేక్షిస్తున్న డీపీఎంఓ వెంకటేశ్వర్లు

కపిలేశ్వరపురం : కుష్ఠు వ్యాధిని పూర్తిగా నిర్మూలించే లక్ష్యంతో ప్రభుత్వం ప్రత్యేక సర్వే నిర్వహిస్తోంది. ఈ నెల 16న ప్రారంభమైన ఈ సర్వే జూలై 16 వరకూ కొనసాగుతుంది. వ్యాధి లక్షణాలున్నవారిని గుర్తించే ప్రత్యేక పరీక్షలు చేసి వ్యాధి నిర్ధారణ చేస్తారు. వ్యాధి సోకినట్టు నిర్ధారణ అయిన వారికి ఉచితంగా చికిత్స అందిస్తారు. రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టిన సర్వే రామచంద్రపురం, మండపేట నియోజకవర్గాల్లో సాగుతోంది. వ్యాధి లక్షణాలు, వ్యాప్తి, సర్వే తీరుతెన్నులపై ఈ కథనం...

రోగుల గుర్తింపునకే..

కుష్ఠు వ్యాధి లక్షణాలున్న వారిని గుర్తించేందుకు శాస్త్రీయ పద్ధతిలో సర్వే ప్రారంభించింది. కపిలేశ్వరపురం మండలం అంగర పీహెచ్‌సీ పరిధిలో 18 బృందాలు, వాకతిప్ప, అచ్యుతాపురం పీహెచ్‌సీల పరిధిలో 19 చొప్పున బృందాలు సర్వే చేస్తున్నాయి. ఆశ కార్యకర్త, మేల్ వలంటీర్‌తో కూడిన బృందం ఇంటింటికీ తిరిగి సర్వే చేస్తారు. హెల్త్ సూపర్‌వైజర్, వైద్య,ఆరోగ్య కార్యకర్తలు ఈ బృందాలను పర్యవేక్షిస్తారు. కోనసీమ జిల్లాలో 1,408 సర్వే బృందాలను 647 మంది అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఇటీవల వారికి శిక్షణ తరగతులు కూడా నిర్వహించారు. వ్యాధి లక్షణాలున్నవారిని ఫొటోల ద్వారా పీహెచ్‌సీ వైద్యులకు ప్రత్యేక యాప్‌లో నివేదిస్తారు. వ్యాధి నిర్ధారణ అయితే చికిత్సను ఉచితంగా చేస్తారు.

వ్యాధి తీవ్రత ఇలా..

ఐదు కన్నా తక్కువ మచ్చలున్న వారిని పాసి బ్యాచిలర్ కేసు గానూ, ఐదు కన్నా ఎక్కువ మచ్చలుండే వారిని మల్టీ బ్యాచిలర్ కేసుగానూ పరిగణిస్తారు. పీబీ కేసులకు రెండు రకాల మందులను ఆరు నెలలు, ఎంబీ కేసులకు మూడు రకాల మందులు ఏడాది పాటు వాడాల్సి ఉంటుంది. రామచంద్రపురం లెప్రసీ ఆస్పత్రి పరిధిలో ఇటీవల నాలుగు పీబీ, మరో నాలుగు ఎంబీ కేసులను గుర్తించారు. జిల్లాలో 37 కేసులను గుర్తించారు. ఇప్పటికే వ్యాధి సోకి చికిత్స పొందుతున్నవారు అనేక మంది ఉన్నారు. కాజులూరు మండలం దుగ్గుదూరు పీహెచ్‌సీ పరిధిలో ఐదుగురు, గొల్లపాలెం పీహెచ్‌సీలో 22 మంది, రామచంద్రపురం అర్బన్ పరిధిలో 32, ద్రాక్షారామ పీహెచ్‌సీలో 30, వెల్లలో 24. కె.గంగవరం మండలం పామర్రు పీహెచ్‌సీలో 24, మండపేట అర్బన్ పీహెచ్‌సీలో 22, కపిలేశ్వరపురం మండలం వాకతిప్ప పీహెచ్‌సీలో 13, అచ్యుతాపురంలో 18, అంగరలో18, ఆలమూరు మండలం పెదపళ్ల పీహెచ్‌సీలో 15, చొప్పెళ్లలో 16 మంది వ్యాధిగ్రస్తులకు చికిత్స అందిస్తున్నారు.

వైద్యసేవల యంత్రాంగం ఇలా..

సాధారణ రోజుల్లో క్షేత్ర స్థాయిలో ఆశ, వైద్య ఆరోగ్య కార్యకర్తలు ద్వారా వ్యాధి తాలూకు అవగాహన కార్యక్రమాలకు ప్రాథమిక సేవకులుగా ఉంటారు. ఎవరికైనా లక్షణాలు కనిపిస్తే వీరిని సంప్రదించాలి. వారి ద్వారా నిర్మాణపరమైన చికిత్స సేవలందుతాయి. ప్రతి పీహెచ్‌సీలోనూ ఎంపీహెచ్‌ఎస్ స్థాయిగల వారిని ఒక నోడల్ పర్సన్‌గా నియమించారు. వారిని డీపీఎంఓ స్థాయి అధికారి షెడ్యూల్ ప్రకారం ప్రత్యక్షంగా పర్యవేక్షిస్తారు. పీహెచ్‌సీ జిల్లా స్థాయిలో అడిషనల్ డీఎంహెచ్ఓ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. డిస్ట్రిక్ట్ న్యూక్లియస్ టీంను డీఎస్ఎంఓ స్థాయి అధికారి పర్యవేక్షిస్తారు. క్షేత్రస్థాయిలో గుర్తించిన లక్షణాలు గల వారికి వ్యాధి సోకిందీ లేనిదీ ఈ బృందం నిర్ధారిస్తుంది. ప్రతి నెలా 10న వ్యాధిగ్రస్తులకు చికిత్స చేసి వారికి కౌన్సెలింగ్ ఇస్తారు.

లక్షణాలను బట్టి బహుళ ఔషధ చికిత్స

కష్ఠు వ్యాధికి అధునిక చికిత్స పద్ధతులు ఉన్నాయి. తొలుత వ్యాధిగ్రస్తులు మానసికంగా ధృడంగా ఉండాలి. మైక్రో బ్యాక్టీరియా ప్రభావంతో ఈ వ్యాధి సోకుతుంది. శరీరంపై రాజరంగు మచ్చలొస్తాయి. ఆ మచ్చపై వెంట్రుకలు రాలిపోతాయి. దురద, స్పర్శ, నొప్పి ఉండవు. ఈ ప్రారంభ లక్షణాలు కనిపిస్తే వెంటనే దగ్గరలోని ఆశ, ఏఎన్ఎంలకు చెప్పాలి. వ్యాధి నిర్ధారణ అయితే బహుళ ఔషధ చికిత్స అందిస్తారు. పుండ్లు గలవారికి అవసరమైతే కత్తిపూడిలోని రిఫరల్ లెప్రసీ ఆస్పత్రిలో శస్త్రచికిత్స చేస్తారు.

సర్వేకు సహకరించాలి



ప్రస్తుతం రాష్ట్రమంతా సర్వే జరుగుతోంది. లక్షణాలున్న వారు విధిగా వైద్య ఆరోగ్య, ఆశ కార్యకర్తలను సంప్రదించాలి. లక్షణాలున్నంత మాత్రాన వ్యాధి సోకినట్టు భావించరాదు. నిర్ధారణ వైద్యులు చేస్తారు. వ్యాధి సోకినప్పటికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు. వ్యాధి పూర్తిగా తగ్గుతుంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు క్రమం తప్పకుండా సర్వే, చికిత్స, ప్రభుత్వ సాయాన్ని అందిస్తున్నాం.

–మాధవరపు వెంకటేశ్వర్లు, డీపీఎంఓ

పేదలకు న్యాయ సహాయం



కార్యక్రమంలో మాట్లాడుతున్న జడ్జి మాధవీదేవి

రామచంద్రపురం: పారా లీగల్ వలంటీర్లు గ్రామాలకు వెళ్లి పేదవారికి న్యాయ సహాయం అందించాలని సీనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సెల్ సర్వీసెస్ అథారిటీ చైర్మన్ కె.మాధవీదేవి అన్నారు. స్థానిక కోర్టుల ప్రాంగణంలో గత రెండు రోజులుగా జరిగిన శిక్షణ శిబిరం సోమవారంతో ముగిసింది. ఈ సందర్భంగా న్యాయమూర్తి మాధవిదేవి మాట్లాడుతూ వలంటీర్లు అందరూ న్యాయ సూత్రాలను నేర్చుకుంటూ గ్రామాల్లో న్యాయ వేదికలు ఏర్పాటు చేసి ప్రజలను చైతన్యం చేయాలని సూచించారు. ప్రతి నెలా కోర్టులో అందించే శిక్షణలో పాల్గొనాలన్నారు. ఈ కార్యక్రమంలో బార్‌అసోసియేషన్ అధ్యక్షులు పిల్లి మురళీమోహన వెంకటరమణ, ప్రధాన కార్యదర్శి వాడ్రేవుసాయిప్రసాద్, సీనియర్ న్యాయవాదులు దొమ్మలపాటి సత్యనారాయణ, పిల్లా పృద్వి, పారా వలంటీర్లు లోక్ అదాలత్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ మళ్లీ జగనన్నే సీఎం కావాలి



అంద్రంగి జగనన్న లే అవుట్‌లో మాట్లాడుతున్న లబ్ధిదారులు

కాజులూరు: అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తూ రాష్ట్రాన్ని ప్రగతి పథంలో నడిపిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగనన్నే మళ్లీ, మళ్లీ సీఎం కావాలని ప్రజలు ఆకాంక్షిస్తున్నారని అంద్రంగి ఎంపీటీసీ సభ్యురాలు మట్టా వెంకటరమణమ్మ అన్నారు. గ్రామంలోని జగనన్న కాలనీలో నూతన గృహనిర్మాణాలను సోమవారం స్థానిక నాయకులు, మహిళలు సందర్శించి లే అవుట్‌లో వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీటీసీ సభ్యురాలు మట్టా వెంకటరమణమ్మ, పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ గ్రామంలో దశాబ్దాలుగా ప్రభుత్వం నుంచి ఏ ఒక్కరికి సెంటు భూమి అందలేదన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగనన్న, మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణల దయతో తమకు స్థలాలు లభించడంతో ఇళ్లు నిర్మించుకుంటున్నామన్నారు. వచ్చే ఎన్నికల్లో జగనన్నకు ఓటు వేసి రుణం తీర్చుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మట్టా ఆదినారాయణ, రాయుడు నాని తదితరులు పాల్గొన్నారు.

గోవిందరావు మృతికి సంతాపం

మండపేట: డీసీఎంఎస్ మాజీ చైర్మన్, ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సర్పంచుల సమాఖ్య మాజీ అధ్యక్షుడు రెడ్డి గోవిందరావు మృతికి ఎమ్మెల్యే వేగుళ్ల జోగేశ్వరరావు సంతాపం తెలిపారు. గోవిందరావు మృతి తీరని లోటని, ఆయన కుటుంబ సభ్యులకు సోమవారం ఒక ప్రకటనలో తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు, అలాగే జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు సంతాపం తెలిపారు.

వాడపాలెం కాలువకు నీరు విడుదల

కొత్తపేట: ప్రస్తుత ఖరీఫ్(తొలకరి) సీజన్‌లో రైతులు వరినాట్లు త్వరగా వేసుకోవాలని మండల వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) చైర్మన్ పెదపూడి త్రిమూర్తిశ్రీనివాస్ సూచించారు. వాడపాలెం లాకుల పైన వాడపాలెం న్యూ చానల్ కింద సుమారు 1400 ఎకరాలకు సాగునీటిని విడుదల చేశారు. స్థానిక ఇరిగేషన్ ఏఈ వి.నవీన్‌కుమార్ ఆధ్వర్యంలో ఏఏబీ చైర్మన్ పెదపూడి త్రిమూర్తిశ్రీనివాస్ చానల్‌కు సోమవారం నీటిని విడుదల చేశారు. చానల్స్‌లో తూటు, తుక్కు, పూడికతో నిండిపోవడంతో ఖరీఫ్, రబీ సీజన్‌లకు సాగునీరు అందేది కాదు. దీంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. దాంతో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి కృషి మేరకు రూ.4 లక్షలు మంజూరు కాగా యుద్ధప్రాతిపదికన పనులు పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో వాడపాలెం రైతు సంఘం అధ్యక్షుడు పెదపూడి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

సుస్థిర పాలనకే గ్రామ సచివాలయాలు

- మంత్రి చెల్లుబోయిన వేణు
- సచివాలయం భవనం ప్రారంభం



సచివాలయ భవనం శిలాఫలకాన్ని ఆవిష్కరించిన మంత్రి చెల్లుబోయిన వేణు

కె.గంగవరం: గ్రామాల్లో సుస్థిర పాలన కోసమే గ్రామ సచివాలయల వ్యవస్థను సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సమాచార, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణు గోపాలకృష్ణ అన్నారు. బాలాంత్రంలో నూతనంగా రూ.50 లక్షలతో నిర్మించిన సచివాలయాన్ని సోమవారం ఆయన ప్రారంభించి, శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడుతూ సుస్థిర పరిపాలన అందించడంతో పాటు గ్రామాల్లోనే నూతన సచివాయాలను నిర్మించారన్నారు. సీఎం జగన్ సంక్షేమ పథకాలు అమలు చేయడంతో పాటు గ్రామాల్లో రక్షిత మంచినీరు, విద్య, ఆరోగ్యం, రోడ్ల నిర్మాణ పనులు చేపడుతున్నారని తెలిపారు. డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, ఎంపీపీ పంపన నాగమణి, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, ఎంపీటీసీ కోట సత్తిబాబు, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి, సర్పంచ్ తోలేటి కృష్ణమూర్తి, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమమే సీఎం జగన్ ధ్యేయం

- మంత్రి చెల్లుబోయిన వేణు
- తాళ్లపోడులో గడప గడపకూ..



తాళ్లపోడులో లబ్ధిదారులకు సంక్షేమ పథకాలను వివరించి పత్రాలను అందిస్తున్న మంత్రి వేణు

కె.గంగవరం: నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలన సాగిస్తున్నారని రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. సోమవారం తాళ్లపోడులో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మంత్రి వేణు ప్రతి ఇంటికీ వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, వారు పొందిన లబ్ధిని తెలియజేశారు. అనంతరం గ్రామంలోని సమస్యలను అడిగి తెలుసుకొని వెంటనే అధికారులతో మాట్లాడి పరిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్ ప్రతి ఇంటికీ సంక్షేమ అందించాలనే ఉద్దేశంతో నవరత్న పథకాలు ప్రవేశపెట్టారని, ప్రజలు ఇబ్బంది పడకుండా ప్రభుత్వ పాలనను ఇంటి ముంగిటకు తీసుకొచ్చారన్నారు. పేదల కుటుంబంలో వెలుగులు నింపాలనే ఉద్దేశంతో సీఎం జగన్ పాలన సాగిస్తున్నారని, రానున్న కాలంలో ప్రతి ఒక్కరూ ఆయనను ఆశీర్వదించాలని కోరారు. సర్పంచ్ చప్పిడి శ్రీను, మార్కెట్ కమిటీ చైర్మన్ పండు గోవిందరాజు, కోఆప్షన్ సభ్యులు కడలి విజయదుర్గ, ఎంపీపీ పంపన నాగమణి, జిల్లా వ్యవసాయ సలహా కమిటీ సభ్యులు బత్తుల అప్పారావు, కాదా గోవిందు, మండల పరిషత్ విప్ కొప్పిశెట్టి లక్ష్మణ్, మార్కెట్ కమిటి డైరెక్టర్ నరాల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

మత్తుకు అలవాటు పడితే జీవితం నాశనం



డ్రగ్స్‌కు వ్యతిరేకంగా మండపేటలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న సెబ్, పోలీసు అధికారులు

- సెబ్ సీఐ సీహెచ్ అరుణమ్మ
- డ్రగ్ రహిత ఏపీలో భాగంగా విద్యార్థుల ర్యాలీ



ర్యాలీ చేస్తున్న విద్యార్థులు

మండపేట: మత్తు పదార్థాలకు బానిసై జీవితాలను నాశనం చేసుకోవద్దని ఆలమూరు సెబ్ సీఐ సీహెచ్ అరుణమ్మ విద్యార్థులకు సూచించారు. డ్రగ్స్ రహిత ఆంధ్రప్రదేశ్ కార్యక్రమంలో భాగంగా సెబ్ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు, ఈ సందర్భంగా సీఐ అరుణమ్మ మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి కష్టపడే తత్వాన్ని అలవరుచుకోవాలని, క్రమశిక్షణతో చదువుకుని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పట్టణ ఎస్ఐ కె.అప్పారావు, ఆలమూరు సెబ్ ఎస్ఐ పి రాంబాబు మాట్లాడుతూ గుట్కా, గంజాయి, మద్యం తదితర మత్తును కలిగించే వ్యసనాలకు బానిసలైతే కలిగే అనర్థాలను విద్యార్థులకు వివరించారు. అనంతరం డిగ్రీ కళాశాల, ఎంపీఎస్ స్కూల్, జూనియర్ కళాశాల విద్యార్థులతో మారేడుబాక వంతెన వరకు డ్రగ్స్‌కు వ్యతిరేకంగా భారీ ర్యాలీ చేశారు. సెంటర్‌లో మానవహారం నిర్వహించి డ్రగ్స్‌కు వ్యతిరేకంగా విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. మండల విద్యాశాఖ అధికారి సీహెచ్‌వీ సోమిరెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మత్తు పదార్థాలతో అనర్థం

రామచంద్రపురం: మత్తు పదార్థాలతో మానసికంగాను, ఆరోగ్య పరంగా ఎన్నో అనర్థాలున్నాయని, వాటికి విద్యార్థులు దూరంగా ఉండాలని స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంటు బ్యూరో ఇన్‌స్పెక్టర్ సీహెచ్ వి.రామకృష్ణ అన్నారు. అంతర్జాతీయ మత్తు పదార్థాల వ్యతిరేక దినోత్సవం సందర్భంగా సోమవారం పట్టణంలోని వివిధ కళాశాలల విద్యార్థులతో అవగాహన ర్యాలీని నిర్వహించారు. ఎస్సై ఈ రవికుమార్, మోడరన్ కళాశాల అధినేత జీవీరావు, రామచంద్రపురం సీఐ దుర్గారావు, ఎస్సై డి.సురేష్ బాబు తదితరులు పాల్గొన్నారు.

బడిఈడు పిల్లల్ని పాఠశాలలో చేర్చాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ నాగరాజు

కె.గంగవరం: ప్రతి గ్రామంలోను ఉపాధ్యాయులు బడిఈడు పిల్లల్ని గుర్తించి వారిని బడిలో చేర్పేలా చర్యలు తీసుకోవాలని ఎంఈఓ ఎ.నాగరాజు అన్నారు. మండల పరిధిలోని కె.గంగవరం ఉన్నత పాఠశాలలో సోమవారం హెచ్‌ఎంలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బడిఈడు పిల్లల్ని గుర్తించడానికి అన్ని గ్రామాల్లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలన్నారు. దీంతో పాటు ప్రభుత్వ నిబంధనల ప్రకారం అమ్మఒడి లబ్ధిదారులకు పూర్తి సమాచారం అందించేందుకు ఆయా పాఠశాలల్లో విద్యార్థుల తల్లిదండ్రులతో సమావేశాలు నిర్వహించాలన్నారు. జగనన్న విద్యా కానుక కిట్లు ప్రతి విద్యార్థికి అందించాలని కిట్లలో నాణ్యత లేకపోతే వెనక్కి తీసుకుని నాణ్యత గల కిట్లను అందించాలని తెలిపారు. హెచ్‌ఎంలు పుల్లయ్య, పి. వెంకటేశ్వరరావు, నరాల కృష్ణకుమార్ తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వి.సావరంలో మహిళా డెయిరీ సెంటర్



వి.సావరంలో నూతనంగా ఏర్పాటైన మహిళా డెయిరీ అసోసియేషన్

రాయవరం: మహిళల ఆర్థిక పరిపుష్టికి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న కృషి మరువరానిదని ఎంపీపీ నౌడు వెంకటరమణ అన్నారు. వి.సావరం సచివాలయంలో సోమవారం మహిళా డెయిరీ అసోసియేషన్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ ప్రభుత్వం మహిళా పాడి రైతులను ప్రోత్సహించేందుకు మహిళా డెయిరీ అసోసియేషన్‌ను ఏర్పాటు చేస్తుందన్నారు. సర్పంచ్ కాకి కృష్ణవేణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో 54 మంది మహిళా రైతులు పాల్గొన్నారు. సదరు సమావేశంలో మహిళా డెయిరీ అసోసియేషన్‌కు 11 మంది సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ వెలగల సత్యనారాయణరెడ్డి, సొసైటీ త్రిసభ్య కమిటీ చైర్మన్ సిరికి కృష్ణారావు, వైఎస్సార్ సీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు గుత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష సక్సెస్‌కు కృషి చేయాలి

- చైర్‌పర్సన్ దుర్గారాణి
- మున్సిపాలిటీ పరిధిలో అవగాహన కార్యక్రమం



కౌన్సిలర్లకు సూచనలిస్తున్న మండపేట మున్సిపల్ చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు



నేలటూరులో జగనన్న సురక్ష కార్యక్రమంపై సూచనలు చేస్తున్న ఎంపీడీఓ రామకృష్ణారెడ్డి

మండపేట: అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించడమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించిన జగనన్న సురక్ష కార్యక్రమం పట్టణంలో విజయవంతానికి కౌన్సిలర్లు, అధికారులు, పార్టీ నాయకులు కృషి చేయాలని మున్సిపల్ చైర్‌పర్సన్ పతివాడ దుర్గారాణి కోరారు. ఈ పథకంపై సోమవారం కౌన్సిలర్లకు మున్సిపల్ కార్యాలయంలో చైర్‌పర్సన్ దుర్గారాణి, వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు అవగాహన సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గత టీడీపీ హయాంలో అప్పటి సీఎం చంద్రబాబునాయుడు ప్రభుత్వ పథకాల నుంచి లబ్ధిదారులను తగ్గించుకునేందుకు సంక్షేమ పథకాల్లో రకరకాలుగా కోతలు పెట్టేవారన్నారు. కాని పేదల కష్టాలు తెలిసిన వ్యక్తిగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల మత వర్గాలు, పార్టీలు చూడకుండా అర్హత కలిగిన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ లబ్ధి చేకూర్చడమే లక్ష్యంగా పనిచేస్తున్నారన్నారు. జూలై 1వ తేదీ నుంచి నిర్ణీత షెడ్యూల్ ప్రకారం ప్రతి సచివాలయం పరిధిలో అధికారులు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి అక్కడికక్కడే సమస్యలు పరిష్కరించడంతో పాటు సర్వీస్ చార్జీలు లేకుండానే అవసరమైన సర్టిఫికెట్లు జారీ చేస్తారని చైర్‌పర్సన్ దుర్గారాణి, రాజుబాబు వివరించారు.

4వ వార్డులో పర్యటన

వార్డు పర్యటనలో భాగంగా చైర్‌పర్సన్ దుర్గారాణి 4వ వార్డు తర్వాణీపేటలో పర్యటించారు. ఇంటింటికి వెళ్లి పారిశుధ్య నిర్వహణ గురించి స్థానికులను అడిగి తెలుసుకున్నారు. స్థానికులు ఆమె దృష్టికి తెచ్చిన సమస్యలపై అక్కడికక్కడే మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్, శానిటేషన్ సిబ్బందితో మాట్లాడి పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు. వైస్ చైర్మన్ పిల్లి గణేశ్వరరావు, జంగమ, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్లు మీగడ శ్రీనివాస్, ఆలీఖాన్‌బాబా, కౌన్సిలర్లు శెట్టి కల్యాణి, పిల్లి శ్రీనివాస్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

పూడికతీత పరిశీలన

పట్టణంలోని డ్రైన్లలో జరుగుతున్న పూడికతీత పనులను సోమవారం సాయంత్రం స్థానిక 20వ వార్డు గొల్లపుంత కాలనీలో చైర్‌పర్సన్ దుర్గారాణి పరిశీలించారు. తీసిన పూడికను త్వరితగతిన తరలించాలని సిబ్బందికి సూచించారు. సచివాలయ కన్వీనర్లు గనిపే భూషణం, పేరూరి మాధవి, పార్టీ నాయకుడు సేనాపతి దొరబాబు, శానిటరీ సెక్రెటరీ వెంకన్నబాబు పాల్గొన్నారు.

కపిలేశ్వరపురం: ప్రజా ప్రయోజనమే లక్ష్యంగా ప్రభుత్వం చేపట్టిన జగనన్న సురక్ష కార్యక్రమాన్ని వలంటీర్లు, గృహ సారథులు, సచివాలయ ఉద్యోగులు ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి, తహసీల్దార్ కొమరం సూర్యారావు అన్నారు. మండలంలో వచ్చేనెల 3 నుంచి 26 వరకూ గ్రామాల్లో కార్యక్రమం చేపట్టనున్నామన్నారు. కాలేరు, నల్లూరు, వాకతిప్ప, వల్లూరు, కపిలేశ్వరపురం, నేలటూరు, అంగర గ్రామాల్లో అవగాహన సమావేశాల్లో వారు పాల్గొన్నారు. ప్రభుత్వ పథకాలు సక్రమంగా ప్రజలకు చేరాలన్నదే లక్ష్యంగా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. సమావేశాల్లో సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు పాల్గొన్నారు.

మెడిసిన్ ర్యాంకర్‌కు ప్రభుత్వ విప్ జగ్గిరెడ్డి అభినందన

ఆలమూరు: చొప్పెల్లకు చెందిన కోలాటి అశ్రిత రాష్ట్ర ఎంసెట్ (మెడిసిన్) 578 ర్యాంకు సాధించిగా జాతీయ స్థాయి నీట్ పరీక్షలలో ఓపెన్ కేటగిరీలో 40,678 ర్యాంక్ సాధించి అత్యుత్తమ ప్రతిభ కనబర్చింది. కొత్తపేట ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ చిర్ల జగ్గిరెడ్డి సోమవారం ఆ విద్యార్థిని నివాసానికి వెళ్లి దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛంతో శుభాకాంక్షలను తెలియజేసి తల్లిదండ్రులను అభినందించారు. అశ్రితకు ప్రోత్సాహక బహుమతి క్రింద రూ.పది వేలు అందజేశారు.